క్లుప్తంగా

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



నల్లజర్ల: బైపాస్ రహదారిపై అచ్చన్న పాలెం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఏఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం టీవీఎస్ మోపెడ్‌పై అనంతపల్లి వైపు నుంచి నల్లజర్ల వైపు వెళుతున్న వ్యక్తిని అటుగా వస్తున్న కొత్త కారు ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో టీవీఎస్‌పై ఉన్న వ్యక్తి డివైడర్ అవతలకు ఎగిరి పడి మృతి చెందాడు. కారు నడుపుతున్న వ్యక్తి పరారయ్యాడు. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

మహిళపై హత్యాయత్నం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ మందుల దుకాణంలో పనిచేస్తున్న యువకుడు ఓ మహిళపై హత్యాయత్నానికి ఒడిగట్టాడు. క్రైం పోలీసుల కథనం మేరకు.. కాకినాడ గాంధీనగర్‌లోని యూనియన్ బ్యాంకు ఏటీఎం ఎదురుగా ఉన్న ఓ జనరిక్ మందుల దుకాణంలో పొన్నాడ వెంకటేష్ పనిచేస్తున్నాడు. అదే దుకాణానికి ఒంటిమామిడి జంక్షన్ వద్ద ఓ ఇంట్లో నివసిస్తున్న 66 ఏళ్ల చెలంచెర్ల సత్యవతి మందులు కొనేందుకు వెళ్లేది. 20 రోజుల కిందట వెంకటేష్ వద్ద ఓ షాంపు కొనుగోలు చేసింది. అది వాడిన తర్వాత జుట్టు ఎక్కువగా రాలిపోతోందంటూ వెంకటేష్‌తో ఘర్షణ పడింది. ఇదే రీతిలో సత్యవతి పలుమార్లు వెంకటేష్‌ను తిట్టింది. దీంతో ఆ యువకుడు ఆదివారం ఆమె భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోకి ప్రవేశించి నన్నే తిడతావా అంటూ సత్యవతిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె మెడ, బుగ్గ, చేతిపై గాయాలయ్యాయి. వెంటనే వెంకటేష్ పరారయ్యాడు. రక్తపు గాయాలతో సత్యవతి ఇంటి నుంచి బయటకు రాగా ఆమె భర్త వెంకటరత్నం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై కాకినాడ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంగారం కోసమే యువకుడు దాడి చేశాడని, తన భార్య మెడలో సుమారు 35 గ్రాముల బంగారు గొలుసు అపహరించాడని సత్యవతి భర్త వెంకటరత్నం ఆరోపించారు. దాడి అనంతరం యథావిధిగా దుకాణంలో కూర్చొని వ్యాపారం చేసుకుంటున్న వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



నల్లజర్ల మండలం అనంతపల్లిలోని వేగిలింగేశ్వరస్వామికి కల్యాణోత్సవం



విశేష అలంకారంలో పెరవలి మండలం మల్లేశ్వరంలోని కపిల మల్లేశ్వరస్వామి వారు



ఉండ్రాజవరం మండలం పాలంగి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం



చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో జ్యోతిర్లింగార్చన

ముక్కంటి.. శరణంటి..

- శివాలయాల్లో కార్తిక పౌర్ణమి పూజలు
- స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు
- పలుచోట్ల జ్వాలా తోరణాలు



దేవరపల్లిలోని ఉమా రామలింగేశ్వరస్వామి గుడి వద్ద మహిళల పూజలు

దేవరపల్లి: కార్తిక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఉపవాసాల్లో ఉన్న మహిళలు శివాలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. జలాశయాల్లో కార్తిక దీపాలు వదిలారు. కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు శివాలయాల్లో అర్చకులకు స్వయంపాకాలు, పసుపు, కంద మొక్క, గుమ్మడి పువ్వు, పిండె సమర్పించి దక్షిణ తాంబూలాలు అందజేశారు. సాయంత్రం చంద్రుడిని చూసి, పూజల అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయాలు శివ నామస్మరణలో మార్మోగాయి.

పూజారులకు వాయనాలు

పెరవలి: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఉపవాసం పాటించిన నూతన వధువులు పసుపు మొక్క , కంద పిలక, వాయనంతో శివాలయాలకు వచ్చి నిష్టగా పూజలు చేశారు. అనంతరం పూజారులకు తాంబూలంతో పాటు స్వయంపాకం అందించారు. మండలంలోని మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టల వేమవరం గ్రామాల మహిళలతో పాటు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముత్తైదువలు ఒక్కసారిగా ఆలయాలకు వచ్చారు. దాంతో రద్దీ నెలకొంది. మహిళలు 365 ఒత్తులు వెలిగించి అవి కొండెక్కే వరకూ శివ నామస్మరణ చేశారు. మల్లేశ్వరం శివాలయం వద్ద ఆదివారం రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలోని గోకర్ణేశ్వర స్వామి, మోర్త, వేలివెన్ను, తాడిపర్రు, వడ్లూరు, వెలగదుర్రు, చివటం తదితర గ్రామాల శివాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. పాలంగి శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో రాత్రి జ్వాలాతోరణం వెలిగించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, ఆలయ ఈవో ఎంవీ రామయ్య, ఆలయ చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, పాలాటి శరత్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు, బ్రాహ్మణగూడెం, చిక్కాల, కలవలపల్లి, మార్కొండపాడు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా శివునికి అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు అర్చకుల ఆధ్వర్యంలో జరిగాయి. ఆలయాల్లో మహిళలు దీపారాధనలు చేశారు. చాగల్లులో ప్రధాన కూడలిలోని రామాలయం వద్ద లక్ష సహస్ర నామ దీపారాధన చేశారు. జ్యోతిలింగార్చన నిర్వహించారు. మహిళలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని పలు శివాలయాల వద్ద రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు.

వేగి లింగేశ్వరునికి లక్షపత్రి పూజ

నల్లజర్ల: కార్తిక పౌర్ణమి సందర్భంగా అనంతపల్లిలోని బాలాత్రిపుర సుందరి సమేత శ్రీవేగి లింగేశ్వర స్వామికి ఆదివారం ఆలయ పూజారి గూడూరి రమేష్ ఆధ్వర్యంలో లక్ష పత్రిపూజ, అభిషేకం, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.రాత్రి జ్వాలా తోరణం కార్యక్రమం జరిగింది.

రైళ్ల హాల్ట్‌లు పునరుద్ధరించాలంటూ ప్రదర్శన



కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద ర్యాలీ చేస్తున్న రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు: కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో 2019కు ముందు ఉన్న 36 రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి సమితి ప్రతినిధులు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రదర్శనగా రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. కరోనా సమయంలో నిలిపివేసిన అన్నీ రైళ్లను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.అన్ని పక్షాలనూ కలుపుకుంటూ దశలవారీగా ఆందోళనను ఉధృతం చేస్తామని నాయకులు ప్రకటించారు. ఈ పోరాటంలో ప్రజలందరినీ భాగస్వాములు చేసేందుకు కరపత్రాలు పంపిణీ చేయాలని, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ఈ అంశాన్ని ప్రచారం చేయాలని, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎంపీలకు వినతి పత్రాలు అందజేయాలని పరిరక్షణ సమితి నిర్ణయించింది. రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ రైల్వేస్టేషన్ వద్ద వారు నినాదాలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీ కృష్ణ, పార్టీ నాయకుడు చెరుకూరి సాయిరాజు, రిటైర్డు ఉద్యోగుల సంఘ నాయకులు పెనుమాక జయరాజు, వీటీ విల్సన్‌రాజు, ఉద్యోగ సంఘ నాయకుడు యాళ్ల నాగేశ్వర రావు, టీడీపీ నాయకుడు కేవీకే రంగారావు, అర్చక సంఘం నాయకుడు బొందలపాటి సుబ్రహ్మణ్యం, హిందూ చైతన్య వేదిక నాయకుడు వైకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ వన సమారాధన

నిడదవోలు రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతీయ రోటరీ కుటుంబ సభ్యుల కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాడిమళ్లలోని కొత్తపల్లి నాగేశ్వరరావు కొబ్బరి తోటలో నిర్వహించిన వన సమారాధనకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ సభ్యులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావులను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి శివ కుమార్, సభ్యులు కాళ్ల రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, పెనుకొండ రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.

దీపం.. దైవ స్వరూపం

దీపం.. దైవ స్వరూపం అంటారు. శివునికి ప్రీతికరమైన కార్తిక మాసంలో, సాక్షాత్తూ కార్తిక పౌర్ణమి నాడు వెలిగించే దీపాలను తిలకిస్తే ప్రత్యక్షంగా దైవ దర్శనం చేసుకున్నట్టే. ఆదివారం కార్తిక పౌర్ణమి సందర్భంగా అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. ఈ ఆలయంలోని విష్ణుమూర్తి ఆయుధాలైన శంఖుచక్రం, ఓంకారం, త్రిశూలం, స్వస్తిక్, వేంకటేశ్వరస్వామి ఆభరణాలు, శివలింగం వంటి ఆకారాలను ప్రమిదలతో ఏర్పాటు చేసి వెలిగించారు. ఆ దీపాలను తిలకించి భక్తులు పులకించారు. – పెరవలి









కొత్త పంథాలో సైబర్ నేరాలు

- కలెక్టర్ మాధవీలత పేరుతో మెసేజ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.. నేరగాళ్లు సామాన్యులనే కాదు అధికారులనూ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనే అందుకు నిదర్శనం. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ సుస్వాగతంకు జిల్లా కలెక్టర్ మాధవీలత అధికారిక ఫోన్ నంబర్ ద్వారా ఓ మెసేజ్ వచ్చింది. తన సమీప బంధువుకు ప్రమాదం జరిగిందని, రూ.50 వేలు ఫోన్‌పే చేసి సదరు స్క్రీన్ షాట్ పంపాలని ఆమె కోరినట్లు సందేశం అందింది. దీంతో తహసీల్దార్‌కు అనుమానం వచ్చి వాకబు చెయ్యగా ఇది హెకర్స్ పనిగా గుర్తించారు. వెంటనే ఆయన రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ నంబరు ద్వారా వాట్సాప్ కాల్స్, సందేశాలు వచ్చాయని తహసీల్దార్ వి.సుస్వాగతం ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్లు, అధికారులు, బంధువుల ఫొటోలతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇలా మోసం చేసేందుకు వాట్సాప్‌లో మెసేజ్‌లు, కాల్స్ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అప్రమత్తంగా ఉండండి

రోజుకో కొత్త పంథాలో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ మాధవీలత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఎటువంటి సందేశాలు వచ్చినా వెంటనే పోలీసులకు, సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని మాధవీలత విజ్ఞప్తి చేశారు. ఇటువంటి వారి ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. బాధ్యత కలిగిన పౌరులుగా ఇటువంటి మోసాలకు అడ్డుకట్ట వేద్దామన్నారు.

నేడు ఆంబోతు వెంకన్న తీర్థం

- వేగేశ్వరపురంలో సందడి
- 77 ఏళ్లుగా కార్తిక పౌర్ణమినాడు ఉత్సవాల నిర్వహణ



వేగేశ్వరపురంలో ఆలయంలోని ఆంబోతు విగ్రహం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏటా కార్తిక పౌర్ణమి నాడు నిర్వహించే తీర్థానికి ఓ ప్రత్యేకత ఉంది. వెంకన్నబాబుకు ప్రతి రూపంగా ఈ ఆంబోతు తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలకు తాళ్లపూడి మండలం నుంచే గాకుండా పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ఆదివారం సాయంత్రం నుంచి ఉత్సవాల సందడి మొదలైంది. సోమవారం తీర్థం నిర్వహిస్తారు.

ఆలయ చరిత్ర....

వేగేశ్వరపురం గ్రామస్తులు 1940 ప్రాంతంలో ఒక ఆంబోతు శరీరంపై శంఖు చక్రాలు వేయించి గ్రామంలో వదిలారు. ఈ ఆంబోతును వేంకటేశ్వరస్వామి ప్రతి రూపంగా భావించి వెంకన్నబాబు పేరుతో గ్రామస్తులు పూజించేవారు.ఈ ఆంబోతు ఏ ఇంటికి వెళితే వారు ఆహారం పెట్టేవారు. 1945 ప్రాంతంలో కార్తిక పౌర్ణమినాడు ఆంబోతు ప్రాణాలు విడిచింది. ఆ ఆంబోతుకు అంత్యక్రియలు నిర్వహించి గ్రామంలోని నైరుతి ప్రాంతంలో సమాధి చేశారు. సమాధి చేసిన స్థలంలోనే ఒక మందిరాన్ని నిర్మించి ఆంబోతు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి కార్తిక పౌర్ణమినాడు ఆంబోతు జ్ఞాపకార్థం ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలను వెంకన్నబాబు తీర్థంగా పిలుస్తుంటారు.

1967లో అప్పటి సర్పంచ్ కైగాల సూర్యచంద్ర రావు పర్యవేక్షణలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచీ నుంచి కైగాల వంశీకుల ఆధ్వర్యంలోనే ఆలయ నిర్వహణ జరుగుతోంది. ప్రస్తుతం ఆయన కుమారుడు రిటైర్డ్ ప్రొఫెసర్ కైగాల సుబ్బారావు ఆలయ నిర్వహణ బాధ్యత చూస్తున్నారు. ఇదే ప్రాంగణంలో సాయిబాబా ఆలయం కూడా ఉంది. ఏటా కార్తిక మాసంలో పౌర్ణమికి ముందు స్వామి వారి కల్యాణం, ప్రత్యేక హోమం, చక్ర తీర్థం నిర్వహిస్తారు. శ్రీపుష్ప యాగంతో తీర్థం ముగుస్తుంది. పూర్వం నుంచీ పెరవలి వంశం వారు ఈ ఆలయ వంశ పారంపర్య అర్చకులుగా వ్యవహరిస్తున్నారు. ఉత్సవాలు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రంగులరాట్నాలు, జైంట్ వీల్స్, జీళ్ల దుకాణాలు వంటివి ఏర్పాటు చేశారు.



వేగేశ్వరపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం

భారత్‌ది అత్యుత్తమ రాజ్యాంగం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- డివిజన్ వ్యాప్తంగా ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత నేతలు



గోపాలపురం పెద్దగూడెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత దేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పట్టణంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసచౌదరి, పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం జేమ్స్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అలాగే మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పట్టణంలోని ఎంవీ నగర్, చర్చిపేటల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెద్దగూడెంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

గోపాలపురం: గోపాలపురం పంచాయతీ పరిధిలోని పెద్దగూడెంలో ఏర్పాటు చేసిన గ్లోబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆవిష్కరించారు. ఇక్కడి నవ చైతన్య అంబేడ్కర్ యువజన సంఘం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ పైడి శిరీష, నాయకులు కూసం రామమోహన్ రెడ్డి, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక దళితవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నుంచి ఎమ్మెల్యే తలారి, వైఎస్సార్ సీపీ నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, అంబేడ్కర్ సెంటర్ వరకూ ప్రదర్శనగా వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్ తదతరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం రాజ్యాంగాన్ని అనుసరించి పని చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

స్థానిక నాలుగు వార్డు, మెరక వీధిలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పెనుమాక జయరాజు, బొంత శ్యాం రవిప్రకాష్, బొంత కిషోర్, ముకురపు రామకృష్ణ, పురుషోత్తం చిన్న తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ గొప్పతనం గురించి, దేశ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల గురించి అధ్యాపకులు వివరించారు. ప్రిన్సిపాల్ జె.సునీత తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని చాగల్లు, చంద్రవరం, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కొండపాడు కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చాగల్లులో బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ నేలపూరి రత్నాజీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారా రాజు, కంచుమర్తి సుబ్బారావు, అక్కాబత్తుల రామకృష్ణ, చిన్నం రాజు, దొడ్డిగర్ల వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాలంగిలో అంబేడ్కర్ యువజన సంఘం, జిల్లెల్ల వెంకటేష్, మేళం విజయ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉండ్రాజవరం ఎస్సై రామారావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ బొక్క శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులతో గ్రంథ పాలకుడు గుత్తికొండ కృష్ణారావు ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో జీఆర్‌కేరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మండలంలోని అన్ని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, తహసీల్దార్ ఆఫీసులో తహసీల్దార్ టి.రాధిక అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అలాగే అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని సంతపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పిట్టా శ్రీనివాస్, జయమోహనరావు, ఎలిపే ప్రకాష్ నివాళులు అర్పించారు. గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ను నివాళి అర్పించారు.



నిడదవోలులో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి నివాళి





సుపరిపాలనకు అండగా నిలవండి

- హోం మంత్రి తానేటి వనిత
- ఆరికిరేవులలో వనిత, సమిశ్రగూడెంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రజలను కోరారు. మండలంలోని ఆరికిరేవుల గ్రామంలో రెండో రోజు ఆదివారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ మల్లిపూడి వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, స్థానిక నాయకులు చావా దామోధరరావు, మల్లిపూడి రాజేష్, యనమదల సూరిబాబు, రంబాల అన్నవరం, మల్లిపూడి శ్రీనివాస్, కొలూరి నరేష్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆరికరేవులలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి వనిత


సమిశ్రగూడెంలో మహిళకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

నిడదవోలు రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆదర్శ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం-1 సచివాలయం పరిధిలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించామన్నారు. బాబుకే గ్యారెంటీ లేదని, ఆయన ఇంకేం రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ ఇస్తాడని ప్రశ్నించారు. చంద్రబాబు పేరు చెబితే ఏ పథకమూ గుర్తు రాదని, కేవలం వెన్నుపోటు ఒక్కటే గుర్తుకొస్తుందని విమర్శించారు. అనంతరం వైఎస్సార్ కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బాబూ జగ్జీవన్‌రామ్, మదర్ థెరిసా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కస్తూరి సాగర్, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, గెడ్డం రవీంద్ర, ఆరుగొలను రమేష్, కొల్లి రాజు, రహీమ్, నజీరుద్దీన్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల నూరు శాతం అమలుకే..

- వికసిత్ భారత్ సంకల్పయాత్ర
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాగరాజు

నల్లజర్ల: కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు నూరు శాతం చేరే లక్ష్యంతో కేంద్రం ప్రత్యేకంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర మిషన్ ప్రారంభించినట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వికసిత్ భారత్ యాత్ర జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యుడు శెట్టిపల్లి శివనాగరాజు అన్నారు. పోతవరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సంకల్ప యాత్ర ఆదివారం నుంచి జనవరి 26 వరకూ జరుగుతుందన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్రం వివిధ పథకాలు అమలు చేస్తోందని అయనన్నారు. అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంత చేయాలని కోరారు. పల్లెల్లో ఈ కార్యక్రమం ప్రారంభ సమయంలో ప్రధాని ప్రసంగం, కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించే ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, ధార్మిక సెల్ జిల్లా నాయకులు హెచ్.సతీష్‌శర్మ, గన్నమనేని సురేష్‌బాబు, అత్తింటి సతీష్, అడబాల ధనలక్ష్మి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.







































